క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



కొలతలు తీసుకుంటున్న హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన చిలప్‌చెడ్ గ్రామంలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ పరిశీలించారు. గ్రామానికి 58 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 12 ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ పూర్తయిందన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన రెండు ఇళ్ల కొలతలు సరి చూసుకుని, యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన వారికి త్వరలోనే మొదటి విడత డబ్బులు వస్తాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మిస్తేనే అర్హులైన లబ్ధిదారులకు డబ్బులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఉన్నారు.

‘పేట’లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పోలీస్‌స్టేషన్ పక్కనే చలివేంద్రం ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ నాగరాజు సొంత ఖర్చులతో దీనిని ఏర్పాటు చేశారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు దీనిని ప్రారంభించారు. ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తామని నాగరాజు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి, దేమె యాదగిరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

గోదామ్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని సూరారం గ్రామంలో హనుమాన్ రైస్‌మిల్లు గోదాంను తహసీల్దార్ మన్నన్ తనిఖీ చేశారు. అలాగే.. ఎస్.కొండాపూర్, గవ్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కాంటా చేసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం తరలింపుపై ఆరా తీశారు. నార్సింగిలోని హనుమాన్ రైస్‌మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన గోదామ్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని లారీల లోడ్ ధాన్యం దించారు, ఇంకా ఎన్ని లారీల లోడ్‌ను దించవచ్చని పరిశీలించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి



క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి, కార్యదర్శి రవీందర్‌చారి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోమారంలో నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చదువుతో పాటు యువత వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు మండల అసోసియేషన్ అధ్యక్షుడు తన సొంత నిధులతో సమకూర్చిన క్రీడా సామగ్రిని అందజేశారు.

పాపన్నపేట సొసైటీ డైరెక్టర్ కన్నుమూత

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట సొసైటీ డైరక్టర్ బేగరి శాంతమ్మ (79) గురువారం సాయంత్రం కన్నుమూశారు. అర్కెల గ్రామానికి చెందిన శాంతమ్మ ఉదయం అస్వస్థతకు గురైంది దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

ఇన్‌చార్జీల పాలనా ఇంకెన్నాళ్లు..?

- తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి లేక ఇక్కట్లు
- కీలక అధికారులు లేక స్తంభించిన పాలనా వ్యవస్థ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. దీంతో పాలనాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పెద్దశంకరంపేట మండలం పాలనా పరంగా పెద్ద మండలంగా ఉంది. ఇక్కడ వివిధ పనులపై ఆయా గ్రామాల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. కీలకంగా ఉన్న తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ శాఖలలో రెగ్యులర్ అధికారులు బదిలీ కావడంతో వారి స్థానంలో మూడు నెలలుగా కొత్త వారిని నియమించలేదు. దీంతో పాలనా వ్యవస్థకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉండగా.. 27 వేలకు పైగా జనాభా ఉంది. నిత్యం విద్యార్థులు, రైతులు, ఇతర పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. తహసీల్దార్ గ్రేస్‌బాయిని మూడు నెలల క్రితం మెదక్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో పాటు ఎంపీడీఓ రఫీఖున్నిసాను కొల్చారం మండలానికి బదిలీ చేశారు. దీంతో



తహసీల్దార్ కార్యాలయం

ఇక్కడ ఎంపీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గ్రామకార్యదర్శులు, ఉపాధిహామీ పనులు, తాగునీటి సమస్యలు, గ్రామాల ప్రత్యేక అధికారుల బాధ్యతలు చూడాల్సిన పరిస్థితి. రాజీవ్ యువ వికాస్ పథకం, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు కూడా ఎంపీడీవో పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే.. కొన్నేళ్లుగా రెగ్యులర్ వ్యవసాయ అధికారి లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి, జొన్న ధాన్యం కొనుగోలు వంటి అంశాలు, రైతు బంధు, రైతుబీమాతో పాటు వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువుల సరఫరా చూడడం ఏఈఓలపై అదనపు బాధ్యతలు ఉంటున్నాయి. ఇక్కడ రెగ్యులర్ ఏఓతో పాటు అదనంగా మరో ఇద్దరు ఏఈఓల అవసరం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో కీలక శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దేవులతండాలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట ఉత్సవంలో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి దేవులతండాలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. పురోహితుడు బాపూశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీజగదాంబదేవి, ఆంజనేయస్వామి విగ్రహ యంత్ర, ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద సామూహిక హోమం చేసి శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కవిత, మాజీ సర్పంచ్‌లు అమర్‌సింగ్, లక్యానాయక్, నాయకులు శ్రీనివాస్ నాయక్, కొర్రశ్రీను, కొర్రచత్రు పాల్గొన్నారు.

జాతరకు భూలక్ష్మమ్మ ఆలయం ముస్తాబు



నారాయణఖేడ్: భూలక్ష్మమ్మ ఆలయం

నారాయణఖేడ్: మండలంలోని తుర్కపల్లిలో ఈనెల 11, 12 తేదీల్లో భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతీ ఏడాది ఆలయంలో ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 11న భూలక్ష్మీదేవి, శివుడిపూజ, నైవేద్యాల సమర్పణ, బండ్లప్రదక్షణ, బోనాల ఊరేగింపు, భజన, కీర్తనలు, 12న పాచిబండ్ల ప్రదక్షణ, నిండుజాతర, కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండలం ధర్మారం గ్రామం నుంచి 20 ఎడ్ల బండ్లు, మనూరు మండలం ఎల్గొయి గ్రామం నుంచి 50 ఎడ్ల బండ్లతో పాటు చుట్టు పక్కల తండాలు, గ్రామాల నుంచి పదుల సంఖ్యలో ఎడ్ల బండ్లతో రానున్నాయి. ప్రతీ ఏడాది ఆలయంలో ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో జనాలు తరలిరానున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.



నారాయణఖేడ్: ఆలయంలో కొలువైన అమ్మవారు

వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

పోతన్‌పల్లిలో గురువారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజలు, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాల్సిందే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బతుకులు మారడం లేదని మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వకపోతే ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు చెందిలా చేస్తామన్నారు. ప్రజాపాలన అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క ప్రజా సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ అందాల పోటీలే ముఖ్యమైనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలందరినీ కలుపుకొని రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు సీపీఎం జిలా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, అశోక్, రాజయ్య, శ్రీనివాస్, రమేష్ గౌడ్, సలీం, రాజేష్, మహేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రామాయంపేట(మెదక్): రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఆర్‌వెంకటాపూర్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. అంతకుముందు రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ రోనాల్డ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేమె యాదగిరి, ఆరోగ్య శిబిరాల చైర్మన్ దామోదర్‌రావు, కోశాధికారి శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **10 నుంచి మల్లికార్జున స్వామి జాతర**



అల్లాదుర్గం(మెదక్): ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు గడిపెద్దాపూర్ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. స్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

◆ **బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం**



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని అందోల్ నియోజకవర్గం అధ్యక్షుడు రాజశేఖర్ గురువారం ఎంపీక చేశారు. మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షుడు పాండు, కార్యదర్శి నరేందర్, సంయుక్త కార్యదర్శి రవికిరణ్, కోశాధికారి మహేశ్, ప్రచార కార్యదర్శి పరదేశ్వర్లు ఎంపీకయ్యారు.వీరికి అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్ నియమక పత్రం అందజేశారు.

బీఎస్ఎన్ఎల్ బాధలెన్నో..!

పాపన్నపేట(మెదక్): బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ బాధలు వర్ణనాతీతమని వినియోగదారులు వాపోతున్నారు. పాపన్నపేట మండలంలో నెట్‌వర్క్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలయని పరిస్థితి నెలకొందన్నారు. ప్రైవేట్ నెట్ వర్క్‌లతో పోటీ పడాల్సిన బీఎస్ఎన్ఎల్.. చతికిల బడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫోన్‌లు చేసినా పట్టించుకోవడం లేదని కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ కిషన్ వాపోయారు. శుక్రవారం తమ బ్యాంకు ఆడిట్ ఉందని, నెట్‌వర్క్ లేక పోవడంతో తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈఓ సంతోష కోరారు. గురువారం కల్హేర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టారు. పట్టా పాసుపుస్తకం- ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తుందని తెలిపారు.

బీరప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రత్నాపూర్ గ్రామంలో గురువారం బీరప్పస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంద పోచమ్మ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలు ఈనెల 12వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి గ్రామస్తులు ఆటోలో నాగధర్ వైపు నుంచి కృష్ణాపూర్ వైపు వస్తున్నారు. ఎదురుగా వచ్చిన బైక్ ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ఉన్నా గుండమ్మ, పర్వయ్య, తదితరులు గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ.1500 జరిమానా, మరో 14 మందికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామానికి చెందిన ఇస్మాయిల్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల ఎల్ఓసీని మంజూరయింది. అనారోగ్యంతో బాధపడుతూ ఇస్మాయల్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి విన్నవించారు. ఈ మేరకు మంజూరయిన ఎల్ఓసీని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఇమ్రాన్, నాయకులు వినోద్ పాల్గొన్నారు.



గతనెల 30న సర్వీసును ప్రారంభించిన దృశ్యం (ఫైల్)

బస్సు మళ్లీ తుస్సు!

- పది రోజులకే సర్వీసు నిలిపివేత
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికుల పాలిట శాపం
- ఖేడ్ ఆర్టీసీ డిపో అధికారుల ఇష్టారాజ్యం

రేగోడ్(మెదక్): నారాయణఖేడ్ ఆర్టీసీ బస్సు డిపో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ‘అంతా మా ఇష్టం..అడిగేవారెవరు?’ అన్న రీతిలో అధికారులు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి. మెదక్ జిల్లాలోని మారుమూల మండలమైన రేగోడ్ గ్రామానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలోనే ఖేడ్ ఆర్టీసీ బస్సు డిపో ఉంది. దశాబ్దాల కాలంగా రేగోడ్ మీదుగా హైదరాబాద్, పటాన్‌చెరు, సికింద్రాబాద్‌కు బస్సు సర్వీసులు నడిపారు. అయితే, చాలా రోజుల క్రితం పటాన్‌చెరుకు సర్వీసు బంద్ అయింది. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు గత నెల 30న మండలంలోని మర్పల్లి గ్రామంలో ఖేడ్ నుంచి పటాన్‌చెరు వరకు ఒక బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీసు ప్రతిరోజు ఉదయం 8:30 నిమిషాలకు రేగోడ్‌లో ఉండాలి. కానీ, రేగోడ్‌లో జాతర ఉత్సవాలకు ఆయా పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణం కోసం గురువారం ఉదయం 8 గంటలకంటే ముందే స్థానిక బస్టాప్‌లో కూర్చున్నారు. ఉదయం 10:30 గంటల దాటినా పటాన్‌చెరు బస్సు రాలేదు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఖేడ్ డిపో అధికారుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పది రోజులు గడవక ముందే మళ్లీ బస్సు సర్వీస్ నిలిచిపోయిందా అని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పటాన్‌చెరు బస్సు సర్వీసు కోసం నిరీక్షిస్తున్నా బస్ రాకపోవడంతో.. 11 గంటలకు వచ్చిన సంగారెడ్డి డిపో బస్సు ప్రయాణికులకు దిక్కయింది. రేగోడ్ మీదుగా నడుపుతున్న ఖేడ్ సర్వీసు బస్సులు వస్తాయో లేదో తెలియని అయోమయ స్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన పనుల కోసం వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తున్నా రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అంటే ఇలానే ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఖేడ్ ఆర్టీసీ డిపో అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ మల్లేశయ్యను వివరణ కోరగా స్పందించలేరు.

ప్రతి రైతుకు ఐడీ కార్డు

వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి రైతు యూనిక్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన చిలప్‌చెడ్ రైతు వేదికలో యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధార్ ఉన్నట్టే, భూమి ఉన్న ప్రతి రైతుకు 11 నంబర్ల విశిష్ట సంఖ్య అవసరమన్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టిందన్నారు. భూ యజమాని ఆధార్ కార్డు అనుసంధానం చేయడంతో రైతు విశిష్ట సంఖ్యను కేటాయిస్తామన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు, భూ యాజమాని పట్టా పాస్ బుక్కు, ఆధార్‌తో లింక్ ఉన్న మొబైల్ తీసుకుని వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ అనిత తదితరులు పాల్గొన్నారు.



రైతులు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఐకేపీ డీపీఎం కొమురయ్య

హత్నూర (సంగారెడ్డి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా ఐకేపీ డీపీఎం కొమరయ్య అన్నారు. గురువారం హత్నూర మండలం గుండ్లమాచునూర్, చందాపూర్, మంగాపూర్, దౌల్తాబాద్, దౌలాపూర్, దేవులపల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం కొమురయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకం వేసి రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. నువ్వులు కేంద్రాల వద్ద సమస్యలు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం దేవేందర్, నిర్వాహకులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కొమరయ్య

ప్రభుత్వ స్థలాల ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



జేసీబీతో అక్రమ నిర్మాణాల కూల్చివేత

తహసీల్దార్ వెంకటస్వామి

పటాన్‌చెరు: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటస్వామి హెచ్చరించారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో సర్వే నంబర్ 381లో ప్రభుత్వ భూమిలో 12 అక్రమ నిర్మాణాలు, నాలుగు బేస్మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధి ఈదుల వాగు సమీపంలోని సర్వే నంబర్ 590, బై1 బై2 బై1 అసైన్డ్ పట్టా కలిగియున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ అక్రమంగా షెడ్డు నిర్మించి అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ఆరోపించారు. సత్యనారాయణ పేరుపై ఉన్న అసైన్డ్ పట్టాను రద్దు చేసి, అక్రమ కట్టడం.. విద్యుత్ కనెక్షన్ తొలగించాలని గురువారం గోపాల్, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రాంరెడ్డి, తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం అందజేశారు. అలాగే, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, మురళిగౌడ్, సత్యనారాయణ, వీరేశం, మాజీ కౌన్సిలర్లు వీరేశం, కలీల్ పాల్గొన్నారు.




తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం ఇస్తున్న చింతాగోపాల్, నాయకులు

మారని వేలం పాట తీరు

11 దుకాణ సముదాయాలకు దరఖాస్తులు కరువు

దుబ్బాకటౌన్: దేవుడు కరుణించినా పూజారి వరమివ్వడన్నట్టు తయారైంది దుబ్బాక మున్సిపల్ సముదాయ దుకాణాల తీరు. పట్టణంలో లాల్ బహదూర్ శాస్త్రి, డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలోని దుకాణ సముదాయాలకు రెండో సారి వేలం పాట నిర్వహించినా తీరు మారడంలేదు. గురువారం 11 దుకాణ సముదాయాలకు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కేవలం ఒక్క షట్టర్‌కు మాత్రమే కృష్ణవేణి అనే మహిళ నుంచి దరఖాస్తు వచ్చింది. పోచమ్మ దేవాలయం సమీపంలో గల 4వ నంబరు షట్టర్‌ను రూ.7,800 అద్దె ప్రాతిపదికన ఆమె దక్కించుకుంది.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఖాళీగా 11 షట్టర్లు

పోచమ్మ దేవాలయం సమీపంలో ఒక షట్టర్, శాస్త్రీ నగర్ సమీపంలో ఆరు షట్టర్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నాలుగు షట్టర్లకు దరఖాస్తులు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు అధికారులు చెప్పారు. 11షట్టర్లు ఖాళీగా ఉండడంతో ఆదాయం వృథాగా పోతుందని ప్రజలు వాపోతున్నారు.